మలి వైదిక సంస్కృతి... ఆనాటి పరిస్థితులు

సెక్షన్-1, యూనిట్-1

వైదిక సంస్కృతి

Q రుగ్వేద కాలం నాటి ఆర్యుల మత విశ్వాసాలను వివరించండి?

A రుగ్వేద కాలం నాటి ఆర్యులు తాము అదుపు చేయలేని, తమకు అర్థం కాని ప్రకృతి శక్తులకు దైవత్వాన్ని ఆపాదించి ఆరాధించే వారు. కేవలం భౌతిక అవసరాల కోసమే దైవాన్ని ఆశ్రయించారు. దేవతల్లో ఇంద్రుడు, అగ్ని, వరుణుడు, రుద్రుడు తదితరులు కనిపిస్తున్నారు. ఆ కాలం నాటి పురుషాధిక్య సమాజమే మతంలోనూ ప్రతిబింబించింది. పురుష దేవతలకున్న ప్రాధాన్యం స్త్రీ దేవతలకు లేదు.

రుగ్వేద కాలం నాటి ఆర్యుల ప్రధాన దైవం ఇంద్రుడు. అత్యధిక శ్లోకాలు ఇంద్రుడిని ఉద్దేశించినవే. ఇంద్రుడిని యుద్ధ దేవుడిగా వాన దేవుడిగా పరిగణించారు. 'తెగ' నాయకుడి లక్షణాలన్నీ ఇంద్రునికి ఆపాదించారు. శ్లోకాల సంఖ్య ఆధారంగా చూస్తే ఇంద్రుని తర్వాత ప్రాధాన్యం అగ్నిది. దేవతలకు, మానవులకు మధ్య వారిధిగా అగ్నిని భావించారు. వివాహాలను అగ్ని సమక్షంలో పవిత్రీకరించారు.

వరుణుడు నీటి దేవుడు. గూఢచారుల సహాయంతో లోకంలోని ప్రతి మానవుడి ప్రవర్తనను వరుణుడు గమనిస్తాడని విశ్వసించారు. అందుకే వరుణుడికి సంబంధించిన శ్లోకాల్లో భయం, పశ్చాత్తాపం ఎక్కువగా కనిపించాయి. వరుణుడు నైతిక, భౌతిక సృష్టి క్రమాన్ని నియంత్రిస్తాడని (దీన్ని 'రుత' - Rta అని పిలిచారు) కూడా విశ్వసించారు. సూర్య, రుద్ర, యమ, సోమ, పూషన్ వంటి పురుష దేవతలను.. ఉషస్, పృథ్వి, అదితి, అరణ్యాని, దిషణ, ఇళా వంటి స్త్రీ దేవతలను ఆరాధించారు.

రుగ్వేదంలో కొన్ని శ్లోకాల్లో గాఢ తాత్విక చింతన, సృష్టి రహస్యాలపై ఆసక్తి కన్పిస్తుంది. కొందరు శ్లోక రచయితలు 'హిరణ్య గర్భం' నుంచి సృష్టి ఆవిర్భవించిందని కూడా ఊహించారు. రుగ్వేదంలో సత్ లేదా బ్రహ్మ అనే నిరాకార, నిర్గుణ దైవం గురించి కూడా చర్చ ఉంది. ఉపనిషత్తుల్లోని ఏకేశ్వర భావనను రుగ్వేదంలోనే ప్రస్తావించడం విశేషం. నైతిక, భౌతిక సృష్టి క్రమం (రుత) గురించి రుగ్వేద ఆర్యులు చేసిన చర్చ వారి తాత్విక గాఢతకు, పరిపక్వతకు నిదర్శనం. వీరు మరణానంతర జీవితాన్ని విశ్వసించారు. యజ్ఞాలను నిర్వహించి సక్రమంగా దైవాలను ఆరాధించినవారు స్వర్గానికి (ఇష్టపరు), అలా చేయనివారు నరకానికి(అవ్రతస్) వెళ్తారని విశ్వసించారు. రుగ్వేద మతానికి యజ్ఞమే కీలకం. అయితే, తొలి దశలో యజ్ఞాలు చాలా సరళంగా ఉండేవి. బార్లీ ధాన్యం, కూరగాయలు వంటివి దేవతలకు సమర్పించి వరాలు పొందాలనుకునేవారు. వారి ప్రార్థనలు పరిశీలిస్తే ఆధ్యాత్మిక పురోగతి కంటే భౌతికేచ్ఛలకే ప్రాధాన్యమిచ్చారని అర్థమవుతోంది.



తమ పశు సంపదను వృద్ధి చేయాలని, వీరులైన మగ సంతానాన్ని ఇవ్వాలని దేవతలను ప్రార్థించే వారు.

రుగ్వేద సంస్కృతికి సంబంధించి పైన చర్చించిన విభిన్న అంశాలు- సామాజిక, ఆర్థిక, రాజకీయ, మత పరిస్థితులు అన్నింటినీ కలిపి ఒక ప్రశ్నగా అడిగే అవకాశం కూడా ఉంది. కొన్ని సందర్భాల్లో రుగ్వేద కాలం (లేదా) తొలి వేద కాలం అనికాకుండా 'క్రీ.పూ. 1500- 1000 మధ్య కాలంలో ఆర్యుల జీవన స్థితిగతులను చర్చించండి'అని కూడా ప్రశ్నించవచ్చు.

గమనించాల్సిన విషయం.. పైన చర్చించినంత సూటిగా కూడా ప్రశ్న లేకపోవచ్చు. కాబట్టి ముందుగా ఇచ్చిన ప్రశ్నను సవ్యంగా అర్థం చేసుకోవాలి. అప్పుడే ఎటువంటి ప్రశ్నకైనా సమాధానం రాయగలుగుతారు. పైన చర్చించిన ప్రశ్నలకుగల సమాధానాలు ఆధారంగానే క్లిష్టమైన కొన్ని ప్రశ్నలను అభ్యర్థులు సాధన చేయవచ్చు. **ఉదాహరణకు-**

- **రుగ్వేద కాలం నాటి ఆర్థిక పరిస్థితులే రాజ్య వ్యవస్థకు కొన్ని పరిమితులు విధించాయి- చర్చించండి?**
- **రుగ్వేద కాలం నాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులే నాటి మత వ్యవస్థలో ప్రతిఫలించాయి- విమర్శనాత్మకంగా పరిశీలించండి?**

మలి వైదిక సంస్కృతి

క్రీ.పూ. 1000-600 వరకు గల మలి వేద కాలంలో ఆర్యుల జీవనంలో పెను మార్పులు సంభవించాయి. యజుర్, అధర్వణ వేద సంహితులు, బ్రాహ్మణాలు, కొన్ని ఉపనిషత్తులు ఈ కాలం నాటి పరిస్థితులను తెలుసుకొనేందుకు ప్రధాన సాహిత్య ఆధారాలు. అలాగే ఎగువ గంగా మైదానంలో జరిపిన తవ్వకాల్లో తొలిసారి జనావాసాలు ఏర్పడ్డ సుమారు 700 స్థలాలు వెలుగు చూశాయి. వీటిని బూడిద రంగు మట్టి పాత్రల స్థలాలు (పేయింటెడ్ గ్రే వేర్-పీజీడబ్ల్యూ సైట్స్) అని వ్యవహరిస్తున్నారు. ఇక్కడ ఇనుము వాడకం కూడా జరిగింది. మలివేద సాహిత్యాన్ని, ఇనుము వాడిన పీజీడబ్ల్యూ దశకు చెందిన పురావస్తు ఆధారాలను సమన్వయం చేసుకుని మలివేద కాలం నాటి ఆర్యుల జీవన శైలిని ఆకళింపు చేసుకోవచ్చు. అంతేకాక, మహాభారతం, రామాయణాల్లోని కొన్ని మౌలికమైన అంశాలు కూడా మలివేద సంస్కృతిని సూచిస్తున్నాయని పరిశోధకుల అభిప్రాయం.

Q మలివేద కాలం నాటి ఆర్యుల జీవన పరిస్థితులు వివరించండి?

A క్రీ.పూ. 1000 నుంచి 600 వరకు ఉన్న మలివేద కాలంలో ఆర్యులు సప్తసింధు ప్రాంతాన్ని విడిచి ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, బీహార్ అంతటా వ్యాపించడమే కాక, బెంగాల్ వరకు ప్రయాణించారని తెలుస్తోంది. మలివేద సాహిత్యం, పీజీడబ్ల్యూ స్థలాల్లో లభించిన పురావస్తు ఆధారాలు మలివేద కాలం నాటి పరిస్థితులను విశ్లేషించడానికి సహకరిస్తాయి.

ఆర్థిక పరిస్థితులు:

ఈ దశలో ఆర్యులు ఒకప్పటి సంచార, అర్ధ సంచార దశను విడిచి, స్థిర నివాసాలను ఏర్పరచుకోవడం విశేషం. ఇందుకు ప్రధాన కారణం- ఈ దశలో ఆర్యులు వ్యవసాయక ప్రజానీకంగా మారిపోవడం. పశుపాలన కంటే వ్యవసాయానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. శతపథ బ్రాహ్మణం వ్యవసాయానికి సంబంధించిన కర్మకాండలను వివరిస్తోంది. అథర్వణ వేదం.. నదీ జలాలను కొత్త కాలువల్లోకి మళ్లించేటప్పుడు చేయాల్సిన కర్మకాండను వివరిస్తోంది. బార్లీతో పాటు గోధుమను కూడా ప్రధానంగా పండించారు. ఈ దశలోనే ఆర్యులకు వరి (వ్రీహి) తో పరిచయం కలిగింది. చిక్కుళ్లు, నువ్వులను కూడా పండించారు. ఈ దశలోనే ఆర్యులకు ఇనుముతో పరిచయం ఏర్పడింది. ఇనుమును వారు శ్యామ/కృష్ణ అయస్ అని ప్రస్తావించారు.

పశుపోషక దశ నుంచి వ్యవసాయక దశకు మారడంతో ఎన్నో నూతన చేతి వృత్తులు వృద్ధి చెందాయి. లోహ సంగ్రహణ సాంకేతికత పెరిగింది. లోహకారులు, వడ్రంగులు, నేతపని వారు, చర్మకారులు, కుమ్మరులు, అద్దకం పని తదితర చేతివృత్తుల వారు కనిపిస్తారు. కొత్త వృత్తులు పెరగడం వల్ల వస్తూత్పత్తి తదనుగుణంగా కొంత ప్రాథమిక మైన వాణిజ్యం జరిగి ఉంటుంది. శతపథ బ్రాహ్మణంలో వడ్డీ వ్యాపారి (కుసిడిన్) ప్రస్తావన ఉంది. కానీ ఈ కాలానికి చెందిన నాణాలేవీ వెలుగు చూడలేదు.

సామాజిక పరిస్థితులు: స్థిర నివాస జీవనం స్పష్టమైన వర్ణ విభజనకు దారి తీసింది. వర్ణ వ్యవస్థలో బ్రాహ్మణులు అత్యున్నత హోదాను పొందారు. యుద్ధాలు చేస్తూ ప్రజలను సంరక్షించడం క్షత్రియుల విధి, వ్యవసాయం, వాణిజ్యం ఇతర వృత్తులు వైశ్యుల పని. పై మూడు వర్ణాల వారికి సేవలు చేయడం శూద్రుల విధి.

ఈ కాలంలో పితృస్వామిక వ్యవస్థ మరింత బలపడి స్త్రీ స్థానం దిగజారింది. కూతురు దుఃఖకారకమని భావించారు. సతీసహగమన దురాచారానికి సంబంధించిన బీజప్రాయమైన సూచన కనిపిస్తోంది. స్త్రీలు 'సభ' వ్యవహారాల్లో పాల్గొనడం జరగలేదు. ఎదురుచెప్పని స్త్రీ మంచి స్త్రీ అని ఐతరేయ బ్రాహ్మణం ప్రకటిస్తుంది. ఈ కాలంలోనే 'గోత్ర' వ్యవస్థ ప్రచారంలోకి వచ్చింది. సగోత్ర వివాహాలను నిషేధించారు. నాలుగు ఆశ్రమాల్లో (జీవిత దశలు) మూడు ఆశ్రమాలు (బ్రహ్మచర్య, గృహస్థ, వాన ప్రస్థ ఆశ్రమాలు) మాత్రమే ప్రస్తావించారు.

రాజకీయ పరిస్థితులు: స్థిర నివాసాలు ఏర్పడటంతో 'జనపదం' ప్రాధాన్యం పెరిగింది. 'సభ' 'సమితి' సమావేశాలు బలహీనపడ్డాయి. 'విదాత' అదృశ్యమయింది. క్రమంగా రాజు అధికారం బలపడింది. తన అధికారాన్ని వంశపారపర్యం చేసేందుకు ప్రయత్నించాడు. ఒకప్పుడు స్వీకరించిన బహుమతులు, కానుకలను 'పన్నులు'గా వ్యవస్థీకరించాడు. 'భాగదూఘ' (పంటలో రాజు భాగాన్ని వసూలు చేసేవ్యక్తి), 'సంగ్రహిత్రి' (కోశాధికారి) వంటి అధికారులు ఏర్పడ్డారు. పన్నుల రూపంలో స్థిరమైన ఆదాయం ఏర్పడటంతో రాజు ఉద్యోగస్వామ్యాన్ని ఏర్పరుచుకోగలిగాడు. రాజు అధికారాన్ని బలపరచేందుకు బ్రాహ్మణులు రాజసూయ, అశ్వమేధ, వాజపేయం వంటి యజ్ఞాలను సృష్టించారు. ప్రజల దృష్టిలో రాజు ప్రతిష్టను, శక్తిని పెంచడమే ఈ యజ్ఞాల ఉద్దేశం.

మత విశ్వాసాలు: రుగ్వేద దేవతలైన ఇంద్ర, అగ్ని ప్రాధాన్యాన్ని కోల్పోయారు. మలివేద కాలంలో సృష్టి కర్త అయిన 'ప్రజాపతి' అత్యున్నత దైవంగా అవతరించాడు. రుగ్వేద మతంలో పెద్దగా ప్రాధాన్యం పొందని రుద్ర, విష్ణు వంటి దేవతల ప్రాధాన్యం కూడా ఈ కాలంలో పెరిగింది.

యజ్ఞాల సంఖ్య పెరగడమే కాక, అవి చాలా సంక్లిష్టంగా తయారయ్యాయి. యజ్ఞాల పేరున జంతు బలులు కూడా అధికమయ్యాయి. యజ్ఞ నిర్వహణలో మంత్రోచ్చారణకు ప్రాధాన్యం పెరిగింది. ఈ క్రమంలో బ్రాహ్మణులు మతంపై గుత్తాధిపత్యం సాధించారు. మలివేద కాలం చివర్లో కర్మకాండల పట్ల, బ్రాహ్మణాధిపత్యం పట్ల వ్యక్తమైన నిరసన కొన్ని ఉపనిషత్తుల్లో కనిపిస్తుంది.

Q రాజకీయ, సామాజిక, ఆర్థిక, మత రంగాల్లో రుగ్వేద, మలివేద సంస్కృతుల మధ్య వ్యత్యాసాలను చర్చించండి?

(గ్రూప్-1 మెయిన్స్-2008)

A తొలివేద/రుగ్వేద కాలంలో (క్రీ.పూ.1500-1000) సప్త సింధు ప్రాంతంలో సంచార, అర్ధ సంచార జీవనం సాగిస్తూ గడిపిన ఆర్యులు, మలివేద కాలంలో (క్రీ.పూ. 1000-600) ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్, బెంగాల్ వరకు విస్తరించి స్థిర నివాసాలను ఏర్పరుచుకున్నారు.

ఆర్థిక పరిస్థితులు: రుగ్వేద కాలంలో ఆర్యులు ప్రధానంగా పశుపాలకులు. కొద్దిగా పోడు వ్యవసాయం చేస్తూ, బార్లీని పండించారు. మలివేద కాలంలో వ్యవసాయం అధిక ప్రాధాన్యాన్ని పొందింది. ఈ దశలో బార్లీతో పాటు గోధుమ, వరి, చిక్కుళ్లు, నువ్వులు కూడా పండించారు. రుగ్వేద కాలంలో ఆర్యులకు కేవలం ఒక్క లోహం (రాగి/కంచు)తో మాత్రమే పరిచయం ఉంది. మలివేద కాలంలో వారికి ఇనుము (కృష్ణ/శ్యామ అయస్)తో పరిచయం కలిగింది. రుగ్వేద కాలంతో పోలిస్తే మలివేద కాలంలో చేతివృతుల సంఖ్య కూడా ఎక్కువే.

సామాజిక పరిస్థితులు: రుగ్వేద సమాజం చాల వరకు సమాన త్వంతో కూడిన గిరిజన సమాజం. ఆ సమాజంలో పూజారులు, యోధులు, సామాన్యులు అనే వర్గాలు మాత్రమే ఉన్నాయి. మలివేద కాలంలో స్పష్టమైన చతుర్వర్ణ వ్యవస్థ రూపుదిద్దుకుంది. రుగ్వేద కాలంలో స్త్రీల స్థితి మెరుగ్గా ఉంది. వారు రాజకీయ వ్యవహారాల్లో కూడా పాల్గొని 'సభావతులు'గా వ్యవహరించారు. మలివేద కాలంలో స్త్రీల పరిస్థితి దిగజారింది. వారు రాజకీయ వ్యవహారాలకు దూరమ య్యారు. సతీసహగమనం బీజప్రాయంగా సూచించారు. పురుషా ధిక్య భావజాలం బలపడింది. రుగ్వేద కాలంలో లేని గోత్ర వ్యవస్థ, ఆశ్రమ భావనలు మలివేద కాలంలో ప్రవేశించాయి.

రాజకీయ పరిస్థితులు: రుగ్వేద కాలంలో 'రాజు' వ్యవహారాలను తెగలోని ప్రజలు 'సభ' 'సమితి' 'విదాత' 'గణ' వంటి సమావేశాల ద్వారా నియంత్రించేవారు. మలివేద కాలంలో స్థిర నివాసాల కార ణంగా ఈ సమావేశాలు తగ్గిపోవడంతో రాజు బలపడ్డాడు. రుగ్వేద కాలంలో కేవలం స్వచ్ఛంద బహుమతులు (బలి) మాత్రమే పొందిన రాజు, మలివేద కాలంలో 'పన్నులు' సేకరించాడు. రుగ్వేద కాలంలో అధికారులు స్వల్పం. మలివేద కాలంలో 12 మంది రత్నిన్‌లు ప్రస్తా వన ఉంది. మలివేద కాలంలో రాజు అధికారాన్ని బలపరిచేందుకు బ్రాహ్మణులు రాజసూయ, వాజపేయం, అశ్వమేధ యాగాలు సృష్టిం చారు.

మత పరిస్థితులు: రుగ్వేద కాలంలో ఆర్యులు ఇంద్రుడు, అగ్ని, వరు ణుడు వంటి దేవతలకు బార్లీ ధాన్యాన్ని, కూరగాయలను నైవేద్యా లుగా సమర్పిస్తూ ఆరాధించారు. యజ్ఞాలు చాలా సరళంగా ఉండేవి. మలివేద కాలంలో రుగ్వేద దేవతలు ప్రాధాన్యం కోల్పోయారు. 'ప్ర జాపతి' అత్యున్నత దైవమయ్యాడు. రుద్ర, విష్ణు వంటి దేవతల ప్రాధాన్యం పెరిగింది. యజ్ఞాల సంఖ్య పెరగడమేకాక, అవి సంక్లి ష్టంగా తయారయ్యాయి. మతంపై బ్రాహ్మణుల గుత్తాధిపత్యం ఏర్ప డింది.

గమనిక: 'వైదిక సంస్కృతి లక్షణాలను చర్చించండి' అనే ప్రశ్నకు కూడా దాదాపు ఇదే సమాధానం రాయాలి. సమాధానం ప్రారంభంలో మాత్రం వైదిక సంస్కృతిని రెండు యుగాలుగా విభజించి అధ్యయనం చేస్తున్న విషయాన్ని వివరించాలి.